# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

శుక్రవారం | 24 | ఏప్రిల్ | 2026 | పేజీలు 12 | www.manamepaper.com


## రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష



2లో..



వివరాలు 2లో..

# కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు

- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- చందోలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్ కుమార్

**గొల్లపల్లి ఏప్రిల్ 23(మనం న్యూస్) :** టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తప్ప, తాలు పేరుతో క్వింటాలకు నాలుగు నుండి ఐదు కిలోల ధాన్యం కోత విధించేవారని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం గొల్లపల్లి మండలం చందోలి గ్రామం లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలు దోపిడీకి గురయ్యాయని అన్నారు. చివరకు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే క్వింటాలుకు నాలుగు నుంచి ఐదు కిలోలు తరుగు, తప్ప, తాలు పేరుతో కోతలు విధించేవారని మంత్రి అన్నారు. 2023 లో ఏర్పాడిన ప్రజా ప్రభుత్వంలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ఇలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

### భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ
# పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి,ఏప్రిల్ 23,(మనం న్యూస్) :** వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల భూ సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని కన్నెపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్, కన్నేపల్లి మండల తహసిల్దార్ రామచందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ..

# ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

- కార్మికులకు గొడుగులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్‌పల్లి ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) : ఆర్టీసీ కార్మికులకు 100% న్యాయం జరిగే వరకు తాను కార్మి కుల పక్షాన పోరాటం సాగిస్తా నని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం ప ట్టణంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఎమ్మెల్యే అన్నారు కార్మికులను కలిసి వారి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ. కా ర్మికుల సమస్యలు పూర్తిగా న్యా యమైనవని, ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటాలు దాటుతున్నాయని, కానీ చేతలు మాత్రం గడప కూడా దాటడం లేద ని ఆయన తీవ్రంగావిమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి జీవో గెజెట్ నోటిఫికేష న్ విడుదల చేశామన్నారు.

2

## కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు

మొదటి పేజీ తరువాయి

కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని మంత్రి సూచించారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. అదేవిధంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు అబ్బాపూర్ గ్రామంలో వడ్లు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్ మరియు వైస్ చైర్మెన్ పురపాటి రాజిరెడ్డి.ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు, గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, మాజీ గ్రంధాలయ చైర్మన్ కటారి చంద్రశేఖర రావు, రమేష్ రెడ్డి, సుధాకర్ రావు, మాజీ సర్పంచ్ పురంశెట్టి వెంకటేశం, మల్లనపేట ఉపసర్పంచ్ స్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురంశెట్టి గౌతమ్ రాజ్ , గ్రామ శాఖ కాంగ్రెస్ నాయకులు చెవుల ప్రభాకర్ పురంశెట్టి రవి ,బొల్లం నగేష్ ,పాడాల నరేష్ ,నాగరాజు ,చెవుల రాజేందర్ చెవుల మహేష్ మరియు రైతులు రాజు రాజయ్య, రెడపక మొండి నారాయణ ప్రమీల జక్కుల లాచయ్య, దొమ్మటి గంగారాం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

వేములవాడ,ఏప్రిల్ 23(మనం న్యూస్):వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి విస్తరణ పనులపై సవివరంగా చర్చించారు. ఇందులో భాగంగా ఈ దశలో చేయాల్సిన పనులను గుర్తించి సవివరంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ అధికారులకు సూచించారు. దీనికి అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తామని విప్ కు అధికారులు తెలిపారు..మరో సారి శృంగేరి పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారి దగ్గరకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధి కి పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. గతంలో సమ్మక్క సారక్క జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై ఆరా తీశారని విప్ గుర్తు చేశారు.ముఖ్యమంత్రి నేతృత్వంలో, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సూచనలు,సలహాలతో అతి త్వరలోనే రాజన్న ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని విప్ తెలిపారు.సమావేశంలో ఆలయ ఈవో రమాదేవి, ఆర్ అండ్ బీ అధికారులు,ఆర్కిటెక్చర్, స్థపతి తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి

కార్యాలయ పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మూత్రశాలలో నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా చేపడుతున్న చర్యలలో భాగంగా జిల్లాలోని పాఠశాలలలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నెన్నెల, తాండూర్ మండలాల తహసిల్దార్ల కార్యాలయాలను సందర్శించి ఆయా మండలాల తహసిల్దార్లు శ్రీనివాస్, జ్యోత్స్న లతో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించి పరిష్కార ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారు వచ్చిన కారణాలను తెలుసుకొని దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఆర్టీసీ కార్మికులకు 100% న్యాయం జరిగే వరకూ వారి తరపున పోరాటం

మొదటి పేజీ తరువాయి

కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం అపాయింట్మెంట్ ఇస్తే ఆ ప్రక్రియ పూర్తవుతుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు న్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ కార్మికుల సమస్యలపై కనీస స్పందన లేకపోవడం దురదృష్టకర మన్నారు. జీవో గెజెట్ ఇచ్చి కూడా అపాయింట్మెంట్ ఇవ్వడానికి ముఖ్యమంత్రి వద్ద సమయం లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించిన ఆయన, నిరసనలు వ్యక్తం చేస్తున్న కార్మికులపై కేసులు నమోదు చేయడం, ధర్నా చేస్తున్న వారికి టెంట్లు కూడా ఏర్పాటు చేయని వ్వకపోవడం అన్యాయమన్నారు. ఆర్టీసీ కార్మికులకు 100% న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.తన వంతుగా వారి కి గొడుగులు అందచేశారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**- జడ్జి దుర్గం గణేశ్**




సుల్తానాబాద్ ఏప్రిల్ 23 (మనం న్యూస్): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కాట్నపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందాలని, చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పలు గ్రామాలలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు కు సంబంధించి సుల్తానాబాద్ కోర్టులో న్యాయసేవాధికార సంస్థ ను సంప్రదించినట్లయితే తగు న్యాయ సహాయం అందిస్తామని అన్నారు. ఇటీవల కాట్నపల్లి ఇటుక బట్టీలో కుక్కల దాడిలో బాలిక మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఇటుక బట్టీ యజమానులు కార్మికుల కుటుంబాలకు రక్షణ కల్పించాలని, కుక్కలు బారిన పడకుండా ఇటుక బట్టీల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇటుక బట్టీలో మృతి చెందిన బాలిక కుటుంబానికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 20 వేల రూపాయల ఆర్థిక సహాయం తో పాటు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోద్నాల రవీందర్, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు బోయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వడ్లకొండ రవికిరణ్, సర్పంచ్ పోగుల ఓగుల పూజ రాజేందర్, ఎంపీవో మౌనిక , గ్రామ కార్యదర్శి రమేష్, జీపీవో దివ్య, ఉప సర్పంచ్ దాసరి రాయమల్లు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ రద్దుకై ఎమ్మెల్యే చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన



హుజురాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్):హుజురాబాద్ డంపింగ్ యార్డ్ రద్దుకై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గురువారం సాయంత్రం చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభించింది.హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ రక్షణ కోసం డంపింగ్ యార్డ్ రద్దు డిమాండ్‌తో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర పోతిరెడ్డిపేట (పోచమ్మ గుడి) వద్ద ప్రారంభమై వెంకట్రావుపల్లి, సిర్సపల్లి, గణేశ్ నగర్, సిర్సపల్లి క్రాస్ రోడ్ మార్గంగా హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. పాదయాత్రలో గ్రామ గ్రామాన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు, యువత, రైతులు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొని డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ…"హుజురాబాద్ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పెట్టే ఏ నిర్ణయాన్నీ అంగీకరించబోమని అన్నారు. డంపింగ్ యార్డ్ రద్దు వరకు మా పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు.డంపింగ్ యార్డ్ కారణంగా భూముల విలువలు తగ్గిపోవడం, కాలుష్యం పెరగడం, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాదయాత్ర ద్వారా ప్రజల గళాన్ని ప్రభుత్వానికి బలంగా వినిపించడమే లక్ష్యమని తెలిపారు. పాదయాత్రలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనగా డంపింగ్ యార్డ్ రద్దు కోసం ప్రజల ఐక్యత స్పష్టంగా కనిపిస్తోంది.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారం పకడ్బందీగా చేపట్టాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

తాండూర్ ఏప్రిల్ 23 (మనం న్యూస్): భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఐ ఏ ఎస్ పేర్కొన్నారు. గురువారం తాండూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఐ ఏ ఎస్ తో కలిసి సందర్శించి, భూభారతి దరఖాస్తుల పరిష్కార విధానాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్జీదారులు అందించిన భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత రికార్డులతో సమగ్రంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ జ్యోత్స్నకు ఆదేశించారు.



# సింగరేణి కార్మికులకు ఎస్‌బీఐ బీమా ధీమా




జైపూర్, ఏప్రిల్ : 23 మనం న్యూస్) : సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం మరో కీలక నిర్ణయం తీసుకుని ఎస్‌బిఐ బీమా తో ధీమా కలగజేసిందని జైపూర్ ఎస్‌టిపిపి ప్లాంట్ యాజమాన్యం తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో శాలరీ ఖాతా కలిగిన సుమారు 40 వేల మంది ఉద్యోగులకు సహజ మరణం సంభవించినా రూ. 10 లక్షల ఉచిత బీమా అందించేలా సంస్థ గురువారం చారిత్రాత్మక ఒప్పందం కుదు-ర్చుకుంది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోనే తొలిసారిగా కార్మికులకు సహజ మరణంపై ఈ స్థాయి గ్రూప్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్లు డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం, ప్రమాదవశాత్తు మరణించినా లేదా పూర్తి అంగవైకల్యం కలిగినా రూ. 1 కోటి బీమా సొమ్ము అందడంతో పాటు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా 70 ఏళ్ల వయస్సు వరకు రూ. 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం లభించనుంది. అంతేకాకుండా, మృతి చెందిన ఉద్యోగి పిల్లల చదువు కోసం రూ. 8 నుండి 10 లక్షలు, అమ్మాయిల వివాహానికి గరిష్టంగా రూ. 10 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది. అలాగే, కార్పొరేట్ శాలరీ ఖాతాదారుల కోసం కేవలం రూ. 8,906 వార్షిక ప్రీమియంతో కుటుంబం మొత్తానికి (భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు) రూ. 50 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని ఎస్‌బీఐ ప్రకటించింది.

సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు డైరెక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి తరఫున జి.ఎం. కిరణ్ కుమార్, ఎస్‌బీఐ తరఫున డీజీఎం నీలాక్షి సింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు



మంథని ఏప్రిల్ 23 (మనం న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఎలక్షన్ల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు సమ్మె బాట పడితే అందులో భాగంగా మంథని పట్టణంలోని బస్ డిపో ఎదురుగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మంథని పట్టణ,మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మండుటెండలో సమ్మెలో పాల్గొన్న కార్మిక సోదర సోదరీమణులకు బిజెపి నాయకులు చల్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ, మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సబ్బాని సంతోష్,వీరబోయిన రాజేందర్ లు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను వారి రాజకీయం కోసం వాడుకుంటుందే కానీ కార్మిక,కర్షక,ఆర్టీసీ సోదర సోదరీమణుల న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించట్లేదని ప్రశ్నించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఆర్టీసీ కార్మికులకు వెన్నుదన్నుగా ఉండే యూనియన్లను రద్దుచేసి కార్మికుల నోరు నొక్కివేసే ప్రయత్నం చేస్తే ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను పూర్తిగా విస్మరించి ఆర్టీసీ సంస్థతో కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని వారు విమర్శించారు. కార్మికులు ప్రభుత్వం ముందుంచిన 32 న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పునరాలోచించి తక్షణమే పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్,మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎల్కసదానందం,

ఓబీసీమోర్చా అధ్యక్షుడు రేపాక శంకర్,ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కారంగుల రాజశేఖర్,యువ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి పార్వతి విష్ణు,పట్టణ కోశాధికారి వొడ్నాల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు మణుగూరు కొమ-రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శిక్షకుల ఎంపిక కోసం దరఖాస్తులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 23,(మనం న్యూస్) : బెల్లంపల్లి ఏరియా గోలేటి లో త్వరలో నిర్వహించనున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిభిరం లో చిన్నారులకు అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్బాల్ క్రీడల పట్ల శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన క్రీడాకారులు ధరఖాస్తు చేసుకోవాలని పర్సనల్ డిపార్ట్ మెంట్ హెచ్ ఓ డి ఎస్ వి రాజేశ్వర్ రావు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 25 రోజుల పాటు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇవాల్సి ఉంటుంది. సింగరేణి సీనియర్ క్రీడాకారులు లేదా పి ఈ టి లు, జాతీయ,రాష్ట్ర స్థాయి క్రీడాకారులు శిక్షణ ఇచ్చేందుకు అర్హులు. గౌరవేతనంగా 3,400 ( మూడు వేల నాలుగు వందల రూపాయలు) ఇవ్వడం జరుగుతుంది. ఆసక్తి గల వారు ఈ నెల 27 వ తేదీ మధ్యాన్నం 2 గంటల లోపు జి ఎం కార్యాలయం పర్సనల్ డిపార్ట్ మెంట్లో ధరఖాస్తులను అందజేయాలని పర్సనల్ డిపార్ట్ మెంట్ హెచ్ ఓ డి ఎస్ వి రాజేశ్వర్ రావు తెలిపారు.

# పాఠశాలలకు విద్యాశాఖ హెచ్చరికలు

జైపూర్ , ఏప్రిల్ : 23 (మనం న్యూస్) : తెలంగాణలో నేటి నుండి వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం విద్యాశాఖ కఠిన నిబంధనలను అమలులోకి తెచ్చింది. సెలవుల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. మరోవైపు, ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా మధ్యాహ్న సమయాల్లో పిల్లలను బయటకు పంపవద్దని, ప్రమాదకరమైన బావులు,చెరువుల వద్దకు ఈతకు వెళ్లకుండా పర్యవేక్షించాలని విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# మిట్టపల్లి గ్రామపంచాయతీలో తీరిన మంచినీటి కష్టాలు



జైపూర్, ఏప్రిల్ : 23 (మనం న్యూస్) : జైపూర్ మండలం మిట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 2వ,3వ వార్డు కాలనీల్లో ఏళ్ల తరబడి నెలకొన్న త్రాగునీటి సమస్యకు గురువారం సర్పంచ్ కామెర మనోహర్ పరిష్కారం చూపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ వార్డులలో పైప్‌లైన్ వ్యవస్థ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన వార్డు సభ్యులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన సర్పంచ్, నూతన పైప్‌లైన్ పనులను పూర్తి చేయించి నేడు మంచినీటి సరఫరాను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మనోహర్ మాట్లాడుతూ...తనను గెలిపించిన ప్రజల గోస నేటితో తీరిందని, కాలనీవాసుల దాహార్తిని తీర్చడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు సభ్యులు జాగటి వెంకటస్వామి, 3వ వార్డు సభ్యులు కొట్రంగి జ్యోతి-అంజయ్య, కార్యదర్శి సాయి కిరణ్ ,కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంథని డిపో జెఎసి ఆధ్వర్యంలో రెండవ రోజు సమ్మె విజయవంతం

మంథని ఏప్రిల్23 (మనం న్యూస్) : మంథని డిపో జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె ఉధృతంగా,2వ రోజు విజయవంతం అయింది. కార్మికులందరూ డిపో వద్దకు చేరుకొని,హమారే మంగే నై దియేతో బస్ క పయ్య నై చాలేగా అని నినాదాలు చేస్తూ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వ మొండివైఖరి నీ ఎండగట్టారు. ఈ రెండవ రోజు సమ్మెకి మద్దతుగా మంథని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి, పుట్ట మధుకర్, భూపాలపల్లి మాజీ జడ్పీటీసీ జక్కు శ్రీహర్షిని,బిఆర్ఎస్ నాయకులు శంకర్ గౌడ్,కౌన్సిలర్ రాజ్ గౌడ్,తగరం శంకర్ లాల్,మంథని లక్ష్మణ్,మిరియాల ప్రసాదరావు,తిరుపతి. అత్తే చంద్రమౌళి,శంకేశి రవీందర్,జేఏసీ చైర్మన్ కేకేరెడ్డి,వైస్ చైర్మన్ ఐలయ్య,వైస్ చైర్మన్ ఖాదర్,కన్వీనర్ గంధం రమేష్,కో-కన్వీనర్లు ఖుతుబుద్దీన్,జనార్దన్, సదయ్య,పోచయ్య జేడీ నాయక్,గోపాల్, మహిళా కార్యదర్శి ఇంతియాజ్ బేగం,భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



## బెజ్జాలలో రెండో రోజు ఉద్రిక్తత



జైపూర్ : జైపూర్ మండలం బెజ్జాల గ్రామానికి చెందిన గుమ్ముల రాజన్న అనుమానాస్పద మృతి ఘటనతో గ్రామంలో గత రెండు రోజులుగా ఉద్రిక్తత కొనసాగింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వాహనంలో గ్రామానికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు, తాము అనుమానిస్తున్న వ్యక్తి ఇంటి ముందు శవంతో ఉన్న వాహనాన్ని నిలిపి , వారంతా రోడ్డుపై బైఠాయించి గురువారం భారీ నిరసన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారు ఆందోళనకు దిగడంతో గ్రామంలో ఉత్కంఠ నెలకొంది. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసు బలగాలతో పాటు ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్, ఎస్సై రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో చర్చలు జరిపారు. చట్టం నుండి ఎవరూ తప్పించుకోలేరని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హామీ ఇవ్వడంతో శాంతించిన కుటుంబ సభ్యులు ఆందోళన విరమించి, అంత్యక్రియలు నిర్వహించారు.

## జాతికుంట చెరువు ఆక్రమణలు తొలగించేలా చర్యలు



బెల్లంపల్లి, ఏప్రిల్ 23, (మనం న్యూస్ ) : జాతికుంట చెరువు ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటానని మున్సిపల్ ఛైర్పర్సన్ దావ స్వాతి రమేష్ అన్నారు. గురువారం ఆమె బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీలోని పురాతన జాతికుంట చెరువు సుందరీకరణ పనులలో భాగంగా చేపట్టిన చెరువు విస్తీర్ణం సర్వే పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతికుంట చెరువును గతంలో పలువురు ఆక్రమణదారులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు వార్డు ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, నిబంధనల ప్రకారం సంబంధిత అధికారుల ద్వారా చెరువు భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేయించి, హద్దులను ఖరారు చేయిస్తామని, చెరువు హద్దుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టి ఉంటే తొలగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వార్డుల అభివృద్ధికి కృషి

బెల్లంపల్లి, ఏప్రిల్ 23, (మనం న్యూస్ ) : వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ ఛైర్పర్సన్ దావ స్వాతి రమేష్ అన్నారు. గురువారం ఆమె బెల్లంపల్లి పట్టణంలోని 9వ వార్డులో 14 లక్షల డిఎంఎఫ్టీ నిధులతో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి పథంలో పయనించేలా చేయడమే తన లక్ష్యం అన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కాంపెల్లి రాజం, బేతి శ్రావణ్, కాంగ్రెస్ నాయకులు కంకటి శ్రీనివాస్, శంకర్ సింగ్, పీక లక్ష్మణ్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పది గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మంథని ఏప్రిల్23 (మనం న్యూస్) : మంథని మండలంలోని పది గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. మండలంలోని పుట్టపాక,అక్కేపల్లి, నగరంపల్లి, మహబూబ్ పల్లి, మల్లేపల్లి,పోతారం, నాగారం,కన్నాల, గుంజపడుగు, సిరిపురం వరి ధాన్యం కేంద్రాలను సర్పంచులు కన్నూరి రాజబాపు, పెయ్యల సంధ్య - సురేష్,నాతరి లత - శ్రీనివాస్,లక్కాకుల సత్యనారాయణ,ఎడ్ల ఆదిత్య,బెల్లంకొండ శ్రీదేవి-సత్యనారాయణ రెడ్డి,గుడిసె గట్టయ్య, దండవేన సంధ్య - భానేష్,గోదారి లక్ష్మీలు ప్రారంభించారు. రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్,ఏఎంసి వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి,మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి,నాయకులు పేరవేన లింగయ్య, ఊదరి శంకర్,కుంట రాజు,రాంరాజశేఖర్, బూడిదశంకర్,ఎడ్ల శ్రావణ్,కన్నూరి సుదర్శన్,చాట్లపల్లి మధు,సంతోష్,ఆకుల సురేష్,అయిలి సతీష్,పోరెడ్డి జ్ఞానప్రసన్న-తిరుపతి రెడ్డి,నౌండ్లసదానందం,కన్నూరిరజిత-సంతోష్,గువ్వల ప్రశాంత్, కొప్పూరి శైలజ,గోష్కి శంకర్,ఎరుకల మోహన్ సాయి,ఎడ్ల సత్యనారాయణ, దాసరి గట్టయ్య,దాసరి లక్ష్మీ,ఎరుకల లలిత- వెంకటస్వామి,భాస్కర్ రెడ్డి,పోయిల రాజయ్య,గాదెదివ్య, కావటి రజిత,గాదె సంజీవరెడ్డి,పాపిరెడ్డి, సంతోష్ రెడ్డి,గుర్రాల రాజలింగు,బొల్లి శంకర్,సమ్మయ్య, మిటుకురామ్మూర్తి, గోదారి మహేందర్, రైతులు, ప్రజాప్రతినిధులు, హమాలీ సంఘం నాయకులు,సంఘ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సోనియా గాంధీ భిక్షతోనే నువ్వు ఎమ్మెల్యేవయ్యావు : కాంగ్రెస్ నాయకుల ధ్వజం



మంథని,ఏప్రిల్ 23 (మనం న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. గురువారం మంథని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పుట్ట మధు తీరును తీవ్రంగా ఖండించారు.తన రాజకీయ ఉనికిని చాటుకోవడం కోసమే మధు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ అధ్యక్షులు అయిలి ప్రసాద్ మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదుల వెంకన్న తదితరులు మాట్లాడుతూ.. కాటారం సభలో సీఎం రేవంత్ రెడ్డిని,మంత్రి శ్రీధర్ బాబును ఏకవచనంతో సంబోధించడం పుట్ట మధు సంస్కారహీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారిని తక్కువ చేసి మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీ.. నువ్వు ఎమ్మెల్యే అయింది ఆ భిక్షతోనే "కెసిఆర్ వల్లే శ్రీధర్ బాబు మంత్రి అయ్యారని మాట్లాడటం హాస్యాస్పదం.అసలు సోనియా గాంధీ తెలంగాణ ఇస్తేనే నువ్వు ఎమ్మెల్యేవయ్యావు, మీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు అన్న సత్యాన్ని మర్చిపోవద్దని నాయకులు గుర్తు చేశారు.శ్రీధర్ బాబు ఉమ్మడి రాష్ట్రంలోనే మంత్రిగా పనిచేశారని, ఇప్పుడు కూడా ప్రభుత్వంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని స్పష్టం చేశారు.నస్తురుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు భరోసా సభ విజయవంతం కావడం,సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా శ్రీధర్ బాబు గారి సలహాలు, సూచనలను కొనియాడటం చూసి పుట్ట మధు తట్టుకోలేకపోతున్నారని నాయకులు ఎద్దేవా చేశారు.రాబోయే రోజుల్లో శ్రీధర్ బాబుకి వచ్చే మంచి పేరును అడ్డుకోవాలని కుట్రతోనే ఇలాంటి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయినా పుట్ట మధుకు బుద్ధి రాలేదని,ఇకనైనా పిచ్చి మాటలు మానుకోకపోతే నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అజ్ఞాతంలోకి వెళ్ళిన చరిత్ర ఉన్న వ్యక్తికి శ్రీధర్ బాబుని విమర్శించే నైతిక హక్కు లేదని తేల్చి చెప్పారు.ఈ విలేఖర్ల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి,కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్,మాజీ పాక్స్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం,ఇతర ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## గంగిపల్లిలో ఎంపీడీవో పర్యటన.. కూలీలకు కీలక సూచనలు



జైపూర్ , ఏప్రిల్ : 23 (మనం న్యూస్) : జైపూర్ మండలంలోని గంగిపెల్లిలో గురువారం ఎంపీడీవో జి సత్యనారాయణ పర్యటించి,ఉపాధి హామీ కూలీలకు కీలక సూచనలు చేశారు. స్థానిక గ్రామంలో సాగుతున్న ఉపాధి హామీ ఫారెస్ట్ ట్రెంచెస్ పనులను సందర్శించి, మస్టర్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన రూ 307 వేతనం పూర్తిగా లభించాలంటే పనుల కొలతలు కచ్చితంగా ఉండాలని, ఎన్ఎంఎంఎస్ ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం గం 5:30 కే పని ప్రదేశానికి చేరుకోవాలని కోరారు.అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆయన, పెండింగ్లో ఉన్న ఇండ్లను లబ్దిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్ట మధు వ్యాఖ్యలపై బగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు




మంథని ఏప్రిల్ 23 (మనం న్యూస్) : కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి సేగ్గం రాజేశ్ పుట్ట మధు వ్యాఖ్యలపై భగ్గుమన్నారు.కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉ న్నాయని,అధికారం దూరమై మతి తప్పి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం మంథనిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను అనుచిత పదజాలంతో సంబోధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు.గౌరవం అనేది ఇచ్చి పుచ్చుకునే విధంగా ఉండాలని, ప్రజాప్రతినిధులు అహంకార ధోరణితో మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. తెలంగాణ రాజకీయాల్లో గతంలో కూడా అనుచిత భాష వాడటం మంచిది కాదని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఘోర పరాజయం చెందిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ వైఫల్యంతో పుట్ట మధు మతి తిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.ప్రజల్లో మంత్రి శ్రీధర్ బాబు, శీనుబాబులకు వస్తున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

ఇలాంటి పిచ్చి మాటలు మానుకోకపోతే నియోజకవర్గంలోని కాంగ్రెస్ సానుభూతిపరులు తీవ్రంగా ప్రతిస్పందిస్తారని హెచ్చరించారు.ప్రజల అభివృద్ధి కోసం పనిచేయకుండా విమర్శలు చేయడం సరికాదని సూచించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రాంత అభివృద్ధికి పలు కీలక కార్యక్రమాలు తీసుకువచ్చారని, ముఖ్యంగా విద్యా రంగంలో కళాశాలల స్థాపనకు ఆయన చేసిన కృషి విశేషమని తెలిపారు.విద్యతోనే ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.అలాగే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని, సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తర్వాతే రాష్ట్ర అభివృద్ధికి మార్గం సుగమమైందని అన్నారు.ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పుట్ట మధు దత్తత తీసుకున్న గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరిగిందో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు.మంథని నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని వారు పేర్కొన్నారు.గత ప్రభుత్వ కాలంలో నిర్మించిన కొన్ని ప్రాజెక్టులు, చెక్‌డ్యాములు గాలి, వర్షాలకు దెబ్బతిన్నాయని విమర్శిస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, అభివృద్ధి పనులను కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.అరెంద గ్రామ శాఖ అధ్యక్షుడు ఉట్ల అనిల్ రెడ్డి, మంథని మున్సిపల్ చైర్మన్ వోద్నల శ్రీనివాస్,వైస్ చైర్మన్ ముస్కుల సహిందర్ రెడ్డి,సింగిల్ విండో మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఐఎన్.టి యుసి జాతీయ కార్యదర్శి పేరవేణి లింగయ్య యాదవ్,బ్లాక్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు, కౌన్సిలర్ లు యల్లంకి వంశీ,జంబోజు శ్రీమతి సమయ్య,కాంగ్రెస్ పార్టీనాయకులు,నాగుల రాజయ్య,సంగెం గట్టయ్య ఈసంపల్లి శ్రీనివాస్,దొనగొర్ర శ్రీనివాస్,మంథని శ్రీనివాస్,గొల్లపల్లి శ్రీనివాస్,ఇందారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 'మే' డే వారోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



జమ్మికుంట, ఏప్రిల్ 23 (మనం న్యూస్): 'మే' డే వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను జమ్మికుంట ట్రాన్స్పోర్ట్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ... 1886లో చికాగో నగరంలో మ- రణించిన అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహించాలని అన్నారు. 140 సంవత్సరాల క్రితం శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, పనిగంటల తగ్గింపు కోసం, వీరోచిత పోరాటం నిర్వహించిన కార్మిక వర్గ ఆత్మార్పణ తో ఏర్పడిన ఎర్రజెండా, కార్మిక వర్గానికి పీడిత ప్రజలకు అనేక హక్కులను సాధించి పెట్టిందని, భవిష్యత్ కార్మిక పోరాటాలకు బాసటగా నిలుస్తుందని తెలిపారు. పాలక దోపిడి ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయంగా నిలిచేది, దోపిడీ లేని సమాజం ఏర్పాటు కోసం, సమ సమాజ స్థాపనకు ఎర్రజెండా ఒక్కటే దిక్సూచి అని అన్నారు. "మే" డే సందర్భంగా పల్లె పల్లెనా ఎర్రజెండా ఎగురవేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక చట్టాల సవరణను, పని గంటల పెంపును, పెట్టుబడుదారి, బడ పారిశ్రామిక, అనుకూల విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని, కులం ప్రాంతం మతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ బిజెపి రాజకీయ లబ్ధి పొందుతుందని ఆరోపించారు. రోజురోజుకు ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి, కార్మికులకు ఉద్యోగ భద్రత లేక, కనీస వేతనాలు అందుబాటు, సమాన పనికి సమాన వేతనం, పర్మినెంట్ పనిలో పర్మనెంటు ఉద్యోగుల నియమించకుండా, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్, వివిధ స్కీముల పేరుతో కార్మికులతో పని చేయించుకుని యదేచ్చగా ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. దీని ద్వారా దేశ అభివృద్ధికి ఆటంకంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని తెలిపారు. కేంద్రం తీసుకొస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతుందని, దానిలో భాగంగానే పని గంటల పెంపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిందని, రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కనీస వేతనాలు అమలు చేస్తాం కాంటాక్ట్ చేస్తామని చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క కార్మిక వర్గ సమస్య పరిష్కారం చేయలేదని, కార్మికులు సమ్మెలు పోరాటాలు చేస్తే పోలీస్ నిర్బంధాలను ఉ పయోగిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జక్కుల రమేష్ యాదవ్, కార్మికులు మధునయ్య, పోచయ్య, చల్ల ప్రభాకర్, కిరణ్ ప్రవీణ్, మల్లేష్, సాయి రాకేష్, సది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతిని తెలంగాణ రాష్ట్ర పండగ గుర్తించి జీవో విడుదల

బెల్లంపల్లి, ఏప్రిల్ 23,(మనం న్యూస్) : ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని తెలంగాణ రాష్ట్ర పండగ గుర్తిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో ను విడుదల చేసింది. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి రోజున శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు ఆర్యవైశ్య వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన విడుదల చేసి, శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాన్ని రాష్ట్ర పండుగ గుర్తిస్తూ అన్ని జిల్లా కలెక్టర్లకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణము వాసవి క్లబ్ పక్షాన జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు రేణుకుంట్ల శ్రీనివాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి కి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతకు కృతజ్ఞతలు తెలిపారు.

# పారిశుధ్యం, ప్రగతి పనులపై అధికారుల దిశానిర్దేశం



జైపూర్, ఏప్రిల్ : 23(మనం న్యూస్) : జైపూర్ మండలంలోని గంగిపెల్లి, పెగడపల్లి గ్రామాల్లో ఎంపీడీవో సత్యనారాయణ తో కలిసి ఎంపిఓ శ్రీపతి బాబురావు గురువారం 'యాప్ ఇన్‌స్పెక్షన్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ శ్రీపతి బాబురావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తూ, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ముఖ్యంగా ఇంటింటి చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను వేరు చేసేలా ట్రాక్టర్లకు గన్ని సంచులను అమర్చాలని, కంపోస్టు షెడ్లలో వర్మీ కంపోస్ట్ తయారీపై దృష్టి సారించాలని ఆదేశించారు.ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, అలాగే నర్సరీలోని మొక్కలకు ప్రతిరోజూ నీరు పోయాలని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కోరుతూ, పంచాయతీ రికార్డులన్నీ ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఏపీఓ బాలయ్య, సర్పంచ్ రామగిరి రాము, కార్యదర్శులు ఏ. సత్యనారాయణ, శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల ఏప్రిల్ 23 (మనం న్యూస్) : కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని గ్రామ సర్పంచ్ చిట్యెనీ లత - రమేష్ ఆధ్వర్యంలో ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని జువ్వాడి కృష్ణా రావుతో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజి రెడ్డి, వైస్ చైర్మన్ పుల్లూరి వెంకటేష్, మండల కాగ్రెస్ నాయకులు కొంతం రాజం చేతుల మీదుగా ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగా స్వామి, వార్డు సభ్యులు తర్ర సునీత, రామగిరి శ్రీధర్, చిట్నేనీ శైలజ, సంకే ప్రవంతి, గజం గంగాధర్, చిట్నేని జగన్, వనతడుపుల పెద్ది రాజు , పంచాయతీ కార్యదర్శి శ్రీరాముల సరిత గ్రామ అధికారులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి



వేములవాడ, ఏప్రిల్ 23(మనం న్యూస్ ): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, మల్లారం, వేములవాడ పట్టణంలోని బాలా నగర్ లో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు? ఆన్ లైన్ లో వెంటనే నమోదు చేశారా లేదా? అనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసున్నారు. రైతుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

**ధాన్యం ఎప్పటికప్పుడు దింపుకోవాలి**

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకోవాలి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ రైస్ మిల్ నిర్వాహకులకు సూచించారు. మర్రిపల్లిలోని మణికంఠ ఇండస్ట్రీస్, మారుతి ఇండస్ట్రీస్ లు, వేములవాడ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులకు ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలను ఆలస్యం చేయకుండా దింపుకొని వాహనాలు తిరిగి కొనుగోలు కేంద్రాలను వెళ్లేలా సహకరించాలన్నారు.

# కొండాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

మేడిపల్లి ఏప్రిల్ 23 (మనం న్యూస్) : కొండాపూర్ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే, విద్యార్థుల తల్లుల పాదపూజ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు తల్లిదండ్రుల చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి అందజేశారు. ఐదవ తరగతి పూర్తిచేసి తదుపరి విద్య కోసం వెళ్లే విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేయడం ద్వారా తల్లిపట్ల గౌరవాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సంస్కారం, నైతిక విలువలు పెంపొందుతాయని, భవిష్యత్తులో వారు మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తూ విద్యార్థులను ఉత్తమ మార్గంలో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో (ఎ.ఎ.పి.సి) చైర్‌పర్సన్ మొగిలి లక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటేష్, రోజారాణి, నరేంద్ర, (సి ఆర్ పి) చింతకింది చంద్రశేఖర్‌తో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఆర్‌టీసీ బంద్ నేపథ్యంలో గోదావరిఖని,మంథని డిపోలను సందర్శించిన డీసీపీ

మంథని ఏప్రిల్ 23 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో ఆర్‌టీసీ బంద్ పిలుపు నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని గోదావరిఖని,మంథని ఆర్‌టీసీ డిపోలను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి గురువారం పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలలో పరిస్థితులను సమీక్షించి,ఆర్‌టీసీ ఉద్యోగులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ సమ్మెను ప్రజాస్వామ్యపరమైన హక్కుగా గౌరవిస్తున్నప్పటికీ అది పూర్తిగా శాంతియుత వాతావరణంలోనే నిర్వహించుకోవాలని సూచించారు.బంద్ సమయంలో ఎటువంటి ఉద్రిక్తతలు, లేదా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలని కోరారు.ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా, అధికారులపై దాడులకు పాల్పడినా అలాంటి వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలను శాంతియుతంగా వ్యక్తపరచాలని, చట్టాన్ని గౌరవిస్తూ ప్రవర్తించాలని సూచించారు. సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లో చేరినా,అలాగే ఆర్‌టీసీ డ్రైవర్లు తిరిగి డ్యూటీలో చేరినా వారికి ఎటువంటి బెదిరింపులు లేకుండా పోలీస్ శాఖ తరపున



పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.డిపో పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన డీసీపీ, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.డిపో,బస్ స్టాండ్ పరిసరాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలపై వెంటనే స్పందించాలని సూచించారు.ఆర్‌టీసీ సిబ్బంది,ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.బంద్ సందర్భంగా ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని, వదంతులను నమ్మకూడదని, ఎటువంటి సమస్యలు గమనించిన వెంటనే పోలీస్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్శనలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి,మంథని సీఐ బి.రాజు, ఎస్సైరమేష్,ఆర్‌టీసీ డీఎంలు,తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆ నెత్తుటి మరకలకు ముప్పై ఎనిమిదేళ్లు

**-పోలీస్ తూటాలకు బలైన ఆదివాసి బిడ్డ**

**- మద్దిమాడలో భీమయ్య వర్ధంతి**



కాసిపేట, ఏప్రిల్ 23(మనంన్యూస్)సరిగ్గా ముప్పై ఏళ్ల కింద చోటు చేసుకున్న రాజ్య హింస నేటికి ఆదివాసీలను వెంటాడుతూనే ఉంది. నిరుపేద గిరిజన కుటుంబాలు గూణ పెంకుల ఇంటి నిర్మాణం కోసం గూడెం పక్కన వున్న అడవి నుండి తెచ్చుకున్న బడితెలు (కర్రలు) నేరమై, వారిని వెంటాడి అటవి, పోలీస్ సిబ్బంది ఉమ్మడిగా జరిపిన లాఠీ ఛార్జ్, కాల్పుల సంఘటన లో ఒకరు మృతి చెందగా, పలువురు తీవ్ర గాయాలకు గురయ్యారు. అనాడు జరిగిన దమనకాండ లో పచ్చని చెట్ల ఆకులపై చిమ్మిన రక్తం మరకలు ఆరిపోయిన, ఆ దురదృష్టకర సంఘటన నేటికి బాధిత కుటుంబాలను వేధిస్తునే వున్నది, ఆ సంఘటన గిరి జీవితాల్లో చీకటి రోజుగా మిగిలి పోయిందనే ఆవేదన ప్రతి ఒక బాధిత కుటుంబంలో కనిపిస్తుంటుంది. ఆనాటి సంఘటనలో మృతి చెందిన చేనేని భీమయ్య వర్ధంతి సందర్భంగా, ఆ హృదయ విదారక సంఘటన స్థానికులు నెమరేసుకుంటున్నారు. కాసిపేట మండలం మద్దిమాడ గిరిజన గ్రామంలో 1988 ఏప్రిల్ 24 న జరిగిన పోలీస్ కాల్పుల్లో, అదే గ్రామానికి చెందిన యువకుడు చేనేని భీమయ్య మృతి, పలువురు తీవ్రగాయాలకు గురైన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిందనీ స్థానికులు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, ఎస్పీఆర్ స్కీమ్ కింద గూడు లేని, నీడ లేని ఆదివాసీలకు, ఇంటి పై కప్పు కోసం మట్టి గూణ పెంకులు ఇల్లు మంజూరు చేసింది. అయితే ఇంటి నిర్మాణం కోసం అవసరం కాగల కర్ర (బడితే)ల కోసం పక్కనే ఉన్న అడవి నుండి తెచ్చుకోవడం నేరమైంది. అడవితోనే ముడిపడి వున్న ఆదివాసి జీవితాలకు అటవి చట్టాలు, నిబంధనలు తెలియని అమాయక, నిరాక్షరాస్యులైన గిరిజనులు, ప్రభుత్వం మంజూరిచ్చిన ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉన్న సందర్భంలో, అటవి శాఖ సిబ్బంది గ్రామంపై దాడి చేసి కర్ర సేకరించి, లారీల్లో యార్డ్ కు తరలిస్తున్న క్రమంలో, గూడెం మొత్తం యిది అన్యాయమని, ఇంటి నిర్మాణానికి కర్ర ఇవ్వాలని లారీలను అడ్డగించి నిలదీశారు. దానిని జీర్ణించుకోలేని అటవి శాఖ సిబ్బంది, పోలీస్ బలగాలను పిలిపించి ఉమ్మడిగా లాఠీ ఛార్జ్ కు తెగబడ్డారు. ఆ చర్యను వ్యతిరేకిస్తూ గిరిజనులు ఆందోళనకు దిగడంతో పరిస్థితి విషమించినట్టుగా తలచిన పోలీస్ బలగాలు, నిరాశ్రయు-లైన ఆదివాసి లపై జరిపిన కాల్పుల్లో చేనేని భీమయ్య మరణించడం, పలువురు తీవ్రగాయాలకు గురికావడం జరిగినట్టు స్థానికులు పేర్కొన్నారు. ఆ సందర్భంలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పిన నాయకులు, అధికారులు, ప్రభుత్వాల హామీలు నేటికి అమలురూపం దాల్చలేదని అన్నారు. ఆ కాల్పుల్లో తన అడవి బిడ్డల పక్షాన, పోలీస్, అటవి సిబ్బంది అకృత్యాలను ముందుండి అడ్డుకునే ప్రయత్నంలో అసువులుబాసిన, యువకుడు చేనేని భీమయ్య అమరత్వాన్ని, ధీరత్వాన్ని స్ఫూర్తిని, ఏటా ఆదివాసి సంఘాలు, ఆదివాసీలు గుర్తు చేసుకుంటుంటారు. తన జాతి కోసం చేసిన ప్రాణత్యాగం అమరమైనదిగా బావించి, ఆయన విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేసుకుని, వర్ధంతి ని, జయంతి లను జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించే భీమయ్య వర్ధంతి కార్యక్రమానికి మండలం లోని ఆదివాసీలంతా తరలివచ్చి ఆయన స్ఫూర్తిని పొందాలని, విజయవంత చేయాలని ఆదివాసి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

# శెట్టిపల్లిలో సింగరేణి ఉచిత వైద్య శిబిరం




జైపూర్ ,ఏప్రిల్ : 23 (మనం న్యూస్) : జైపూర్ మండలం శెట్టిపల్లి సింగరేణి సంస్థ ఎస్‌టిపిపి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాంట్ జిఎం ఎం. మదన్మోహన్ మాట్లాడుతూ, ప్లాంట్ ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్యంపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని అన్నారు.ఉన్నతాధికారుల సూచన మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ముందస్తు వైద్య పరీక్షల ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ప్లాంట్ వైద్య విభాగం డాక్టర్ కె. పవన్ ఆధ్వర్యంలో 44 మంది మహిళలు, వృద్ధులు, ఇతర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి వైద్య సిబ్బంది, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



జమ్మికుంట, ఏప్రిల్ 23 (మనం న్యూస్): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధరకు నేరుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజిరెడ్డి, ఆదిత్య రాజు, ఉప సర్పంచ్ కస్తూరి శ్రీనాథ్, వార్డు సభ్యులు పసరగొండ శ్రీనివాస్, సింగవేణ చంద్రమౌళి, తాళ్లపల్లి ఆంజనేయులు, ఐకెపి పద్మ, సిసి పరమేశ్వరి, వివో ప్రియాంక, స్వప్న, రమ, హమాలి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్ ఫలితల్లో సత్తా చాటిన రామారావు పేట విద్యార్థి చిప్పకుర్తి అమృత




జైపూర్, ఏప్రిల్ 23,(మనం న్యూస్) : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జైపూర్ మండలం రామారావుపేట గ్రామానికి చెందిన ఎస్సీ గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని అమృత రాణి ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకు సాధించి ప్రతిభ చాటింది.గౌరీదొడ్డిలోని ఎస్సీ గురుకుల బాలికల కళాశాల నుంచి మొత్తం 104 మంది విద్యార్థినులు జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరుకాగా,వారిలో 59 మంది జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు.ఈ జాబితాలో చిప్పకుర్తి అమృత రాణి కూడా స్థానం సంపాదించింది.రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ గురుకులాల్లోని విద్యార్థులు కూడా విశేష ప్రతిభ కనబరిచి,సుమారు 441 మంది జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించడం విశేషం.ఈ సందర్భంగా ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మచ్చ నరసయ్య విద్యార్థిని,ఆమె తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందించారు.

# అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం



వేమనపల్లి, ఏప్రిల్ 23, (మనం న్యూస్ ): మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం అంగన్వాడి సూపర్వైజర్స్ భారతి, సువర్ణ అధ్యక్షతన పోషణ పక్షం కార్యక్రమంలో నిర్వహించగా గాగ్రామంలో ఎంపీడీవో కుమార్ స్వామి, మెడికల్ ఆఫీసర్ అన్వేష్, వేమనపల్లి సాయి కృష్ణ, నీల్వాయి సర్పంచ్ సమ్మయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అపరంజి, అంగన్వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# వేమనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజినీ దేవికి ఘన వీడ్కోలు



వేమనపల్లి, ఏప్రిల్ 23, (మనం న్యూస్) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసే పదవి విరమణ పొందిన సరోజినీ దేవికి గురువారం పాఠశాల ప్రాంగణంలో పదవి విరమణ మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సరోజినీ దేవికి ఈనెల 30వ తేదీన అధికారికంగా పదవి విరమణ ఉండగా పాఠశాలకు వేసవి సెలవుల దృశ్య పని దినం కావడంతో ఉపాధ్యాయ బృందం, ముందస్తుగా వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి పి శ్రీధర్ రెడ్డి హాజరై మాట్లాడారు సరోజినీ దేవి తన సుదీర్ఘ సర్వీసులో విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేశారని, ఆమె సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థులకు తదితరులు పాల్గొన్నారు.

# చదువే మన జీవన శైలిని మార్చుతుంది



మన జీవన శైలిని మార్చగలిగేది చదువు ఒక్కటేనని రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల( బాలురు) సముదాయం ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ అన్నారు. 2025బి26విద్యానవత్సరం ముగింపు సందర్భంగా గురువారం ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదివిన విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదవడం రాయడంతో పాటు తమకు నచ్చిన రంగంలో నైపుణ్యం పెంచుకుని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల రెవెన్యూ అధికారి పద్మయ్య మాట్లాడుతూ చదువు వల్ల సంపాదించిన జ్ఞానం మనల్ని గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రాజశేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, పుర్రె రమేష్,యం డి రాజమహ్మద్, అయిత పద్మ జి.తరంగిణి,ఏనుగు రజిత,యస్.శోభ సి ఆర్ పి కె రవీందర్ తదితరులు పాల్గొన్నారు. పిల్లలు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

# విచక్షణ రైతంగా పంటలపై ఎరువుల వాడడం సరైంది కాదు : డాక్టర్ కిరణ్ కుమార్



మంథని ఏప్రిల్ 23 (మనం న్యూస్) విచక్షణ రైతంగా పంటలపై ఎరువులు వాడడం ద్వారా పంట పెట్టుబడి పెరగడంతో పాటు భూసారం దెబ్బతింటుందని, రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని,వాటి ఫలితాలు ఆధారంగా సిఫార్సు చేసిన ఎరువులను వాడి, పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటు సూక్ష్మ పోషక లోపాలను అధిగమించవచ్చని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు.కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్,మండల వ్యవసాయ అధికారి డాక్టర్ నవ్య ఆధ్వర్యంలో మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామంలో గురువారం సమగ్ర ఎరువుల యాజమాన్యం,భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భూసార పరీక్షల కొరకు మట్టి నమూనాను సేకరించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.మండల వ్యవసాయ అధికారి నవ్య మాట్లాడుతూ కృత్రిమ ఎరువుల వాడకం తగ్గించి వాటికి ప్రత్యన్మయం పచ్చి రొట్టె ఎరువులు జీలుగులు,పిల్లిపెసర, జనుము వేయాలని ఆమె రైతులకి విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో ఏఈఓలు మురళి,శివ, ప్రత్యూష,రైతులు పాల్గొన్నారు.

## సంగేమ్ గ్రామంలో ఘనంగా శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి జాతర కళ్యాణ మహోత్సవం



కోరుట్ల ఏప్రిల్ 23 (మనం న్యూస్) : కోరుట్ల మండలం సంగేమ్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర గురువారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శిఖరము ద్వారా పాలకులు విగ్రహాల ప్రతిష్ట చేసి అర్చకుల వైదిక నిర్వహ హోమము, అన్నదానము నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ సర్పచ్ చీటీ స్వరూప వెంకటరావు ఉప సర్పంచ్ సుధవేణి మహేష్, బి ఆర్ ఎస్ అధ్యక్షులు సుధా వేణి భూమయ్య, కోరుట్ల మార్కెట్ డైరెక్టర్ పోతుగంటి వెంకట్ గౌడ్, వార్డు మెంబర్లు బోలు మల్ల నరేష్, ధోనె రాజు, బొల్లుమల్ల గంగాధర్, గంగారెడ్డి, గంగ నరసయ్య,ఎరాజా నరసయ్య, దేవ లక్ష్మీనారాయణ, రవి బులమల్ల ప్రవీణ్ తదితరులు గ్రామ ప్రముఖులు ప్రజలు అందరూ పాల్గొని ఆ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని అన్న ప్రసాదాన్ని స్వీకరించి ఇట్టి జాతరను నూతనంగా ఏర్పాటుచేసిన ద్వారపాలకులను ఆలయ శిఖరంను నూతనంగా ఏర్పాటు చేసుకొని హోమము యజ్ఞము జరుపుకొని అర్చన ప్రతిభక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జాతరను విజయవంతం చేశారు.

## ముందస్తు బడిబాట కార్యక్రమం




మంథని ఏప్రిల్ 23 (మనం న్యూస్) : మంథని మండలం చిన్నఓదాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం పిల్లల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మీటింగ్ నిర్వహించి అనుల్ డే సెలబ్రేషన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ నాగుల శారద - రాజయ్య,వార్డ్ సభ్యులు లింగాల శ్రావణ్ లు హజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఉచిత సౌకర్యాలు,విద్య గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలు చదువుకునేలా చూడాలని తల్లిదండ్రులను సర్పంచ్ నాగుల శారద - రాజయ్య కోరారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చదువుకుంటే బాగుంటుందన్నారు. పిల్లలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేయాలంటే బేసిక్ విద్య మంచిగా ఉండాలని ఉపాధ్యాయులకు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులు మంచి చదువులు చదువుకొని ఉంటారని పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. శారద, ఉపాధ్యాయురాలు జ్యోతి,గ్రామ ప్రజలు లింగాల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిపీపీ భద్రతపై (సిఐఎస్‌ఎఫ్) డీఐజీ ఆకస్మిక తనిఖీ



జైపూర్, ఏప్రిల్ : 23 (మనం న్యూస్) : జైపూర్ మండల కేంద్రంలోని ఎస్‌టిపిపి భద్రతా వలయాన్ని సీఐఎస్‌ఎఫ్ డీఐజీ డాక్టర్ ఎం.జీ. రాఘవేంద్ర కుమార్ గురువారం క్షుణ్ణంగా పరిశీలించారు. ప్లాంట్ సందర్శనకు విచ్చేసిన ఆయనకు జీఎం ఎం. మదన్ మోహన్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అనంతరం సీఐఎస్‌ఎఫ్ యూనిట్‌ను తనిఖీ చేసిన డీఐజీ, ప్లాంట్ రక్షణ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే... భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు కీలక సూచనలు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ చాంచల్ సర్కార్, పర్సనల్ డీజీఎం కిరణ్ బాబు, జీఎం ఎస్ఓ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఐదవ వార్డులో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపండి : కౌన్సిలర్ స్వరూపాక రమాదేవి రమేష్



కోరుట్ల ఏప్రిల్ 23 (మనం న్యూస్) : కోరుట్ల మున్సిపల్ 5వ వార్డులో సమస్యలు చాలా ఉన్నాయని వాటికి పరిష్కారం చూపించగలరని వాడు కౌన్సిలర్ సోరూపాక రమాదేవి రమేష్ మున్సిపల్ కమిషనర్ కు విన్నవించారు. ఐదో వార్డ్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ కమిషనర్ ని వార్డుకు రప్పించి వారికి అక్కడున్న రోడ్లు డ్రైనేజీ గాని వీధిదీపాల గూర్చి అన్నిటికంటే ముఖ్యమైన సమస్య నీళ్ల వీటి గురించి కమిషనర్ కి స్వయంగా వివరించారు. అయ్యప్పగుట్టపై మురికి కాలువలు లేక వీధి స్తంభాలు లేక అనేక సమస్యలు ఉన్నాయని వీటి పరిష్కారం దిశగా నిధులు మంజూరు చేసి ఐదవ వార్డు కూడా కోరుట్ల పట్టణంలోనే ఉందని అభివృద్ధి చేసి చూపించాలని విజ్ఞప్తి చేశారు. వారు స్పందిస్తూ వెంటనే మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డును సందర్శించినందుకు మున్సిపల్ కమిషనర్ కి ధన్యవాదాలు తెలియజేశారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి నేరుగా తీసుకురావాలని ఐదవ వార్డ్ కౌన్సిలర్ సోరుపాక రమాదేవి రమేష్ వాడు ప్రజలకు సూచించారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఏకబిల్వం మొక్క నాటింపు



మేడిపల్లి ఏప్రిల్ 23 (మనం న్యూస్): మేడిపల్లి ఏప్రిల్ 23 (మనం న్యూస్): వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు జన్మదిన సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా హరిత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఏకబిల్వం మొక్కను నాటారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామ పరిధిలోని తొంబరావుపేట శివాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చల్మెడ లక్ష్మీనరసింహారావు పేరుతో ఆలయంలో అర్చనలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో పవిత్రతకు ప్రతీకగా భావించే ఏకబిల్వం మొక్కను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి రమేష్ పంతులు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గోపి, సలహాదారు మాజిద్‌తో పాటు కట్లకుంట, తొంబరావుపేట ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి చెట్లు నాటాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వంటి కార్యక్రమాలు సమాజంలో పర్యావరణంపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు తెలిపారు.

## ఎలిగేడులో పోషణ్ పక్వాడ



పెద్దపల్లి /ఎలిగేడు ఏప్రిల్ 23 (మనం ప్రతినిధి): ఎలిగేడు మండల కేంద్రంలోని అంగన్వాడి మూడవ సెంటర్లో గురువారం పోషణ్ పక్వాడ (ఈసీసీఈ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు, అన్నప్రాసన, గ్రాడ్యుయేషన్ డే బాల మేళా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కప్పల ప్రవీణ్ మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు అంగన్వాడి సెంటర్లో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు . అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్యకళ అంగన్వాడి సెంటర్ల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంజలి వార్డు సభ్యురాలు సృజన, అంగన్వాడి టీచర్లు సరోజ, జ్యోతి, సరస్వతి, ఆశ సరోజన, ఆయాలు, గర్భిణీలు ,బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు జిల్లాల చెత్తతో హుజురాబాద్ భవిష్యత్తును బొంద పెడతారా?

**- బిజెపి శాసనమండలి సభ్యులు అంజిరెడ్డి**



హుజురాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్): హుజురాబాద్ మండలం సిర్సపల్లి శివారులో దాదాపు 125 ఎకరాలలో నాలుగు జిల్లాలకు సంబంధించిన చెత్తను ఇక్కడ డంపింగ్ చేయడానికి యార్డు ఏర్పాటు చేస్తే , చుట్టుపక్క గ్రామాలు, హుజురాబాద్ ప్రజలకు, ఈ ప్రాంత భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని, ప్రభుత్వం నాలుగు జిల్లాల చెత్తతో ఇక్కడ డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి హుజురాబాద్ భవిష్యత్తును బొంద పెడతారా అని బిజెపి శాసనమండలి సభ్యులు అంజిరెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. గురువారం బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, హుజురాబాద్ బిజెపి నేతలతో కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డంపింగ్ యార్డ్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరికాదని, ప్రజల అభీష్టానికి అనుగుణంగా పనిచేయాల్సిన ప్రభుత్వం తమకు తోచినట్టు వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. నాలుగు జిల్లాల చెత్తను తీసుకొచ్చి ఒక్క ప్రాంతంలో వేస్తే ఇక్కడి ప్రజల పరిస్థితి ఏంటి.? వాళ్లు ఎలా జీవిస్తారు..? వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతుల పరిస్థితి ఏంటి..? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో మొండిగా నిర్ణయం తీసుకొని ఇక్కడి ప్రాంతంలో యార్డ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం భావ్యం కాదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయకపోయిన పర్వాలేదు కాని, కీడు, హాని తలపెట్టే కార్యక్రమాలు చేపట్టవద్దన్నారు. ప్రశాంతంగా ఉన్న హుజురాబాద్ ప్రాంత ప్రజలను బాధ పెడుతుందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమస్యలను సృష్టించడం సరికాదన్నారు.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామనే ప్రకటన, నిర్ణయంతో హుజురాబాద్ ప్రాంతంలో నెల రోజులుగా గందరగోళ పరిస్థితులు వచ్చాయన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వద్దని నెల రోజులుగా ప్రజలు ఆందోళలు నిరసన కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మొండి వైఖరి తోనే ఉండడం సరికాదన్నారు.. ప్రజలంతా ఒక్కటై, అన్ని పార్టీలు, అన్ని సంఘాలు ఒక్కటై జేఏసీగా ఏర్పడి ముక్తకంఠంతో నినదించిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని మార్చుకొని, డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, డంపింగ్ యార్డ్ రద్దు ప్రకటన చేయాలన్నారు. విత్తన కేంద్రంగా ఉన్న ఈ హుజురాబాద్ ఏరియాలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, తుర్పాటి రాజు, పారిపెల్లి కొండాల్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఇల్లందకుంట మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, కౌన్సిలర్స్, మొలుగురి సుమలత, పంజాల మనోజ్, దామర అనూష, తూర్పాటి లక్ష్మీ దుర్గ, కొండ ప్రశాంతి, కందుగుల సర్పంచ్ ముప్పు మహేష్ బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సాధారణ సమావేశంలో 47 అంశాలకు ఆమోదం



మెట్ పల్లి ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) పురపాలక సంఘ సమా వేశంలో ఎజెండలో పొందుపరిచి న. 47 అంశాలకు 47 అంశాలను పాలకవర్గం ఆమోదించిశీది. గురు వారం ము న్సిపల్ చైర్మన్ మైలార పు లింబాద్రి ఆధ్వర్యంలో పుర పా లక సాధారణ సమావేశం జరిగింది ఈ సమావేశంలో (47) అంశాల ను పొందుపరచగా అట్టి అంశాలను కౌ న్సిల్ సభ్యులు ఆమోదం తెలిపా రు. అనంతరం కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ. ప్రస్తుత ఎండాకా లం దృష్ట్యా అన్ని వార్డులలో నీటి ఎద్దడి కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రధానంగా వీధి దీపాల సమస్య ఉన్నందున అట్టి దానిని పరిష్కరించాలని, పారిశు ధ్య పనులు కూడా అన్ని వార్డులలో వెంట వెంటనే చేయిం చాలని, మరియు వీధి కుక్కలు, కోతుల బెడద వెంటనే పరిష్కరిం చాలని గౌరవ కౌన్సిల్ సభ్యులు చైర్మన్ ను కోరారు. తదుపరి చైర్మన్ మాట్లాడుతూ. కౌన్సిల్ సభ్యులు చెప్పిన అన్ని విషయాల మీద దృష్టి సారిస్తామన్నారు. సమ స్యలు అన్నింటినీ దశలవారీగా త్వ రితగతిన పరిష్కరిస్తూ మెట్ పల్లి పట్టణాభివృద్ధికి అందరం కలిసిక ట్టుగా పనిచేద్దామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్,మున్సిపల్ కమిష నర్ హెచ్.ఎం. స్పందన, డి. ఇ.ఇ నాగేశ్వరరావు, మేనేజర్ వెంకట లక్ష్మి, టి.పి.ఓ రాజేంద్రప్రసాద్, ఆర్.ఓ. మిర్జా అజ్మతుల్లా బేగ్, జె.ఎ.ఓ రమేష్, కౌన్సిలర్స్, ఆఫీస్ సిబ్బంది తదితరులున్నారు.

# గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బోయిన్ పల్లి, ఏప్రిల్ 23(మనం న్యూస్ ): బోయినపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యూసుఫ్ మొయినుద్దీన్,ఎంపీడీవో జయశీల,సొసైటీ ప్రత్యేక అధికారి గౌస్,వ్యవసాయ అధికారి ప్రణీత, మాజీ డి సి ఎం ఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, నాయకులు కొప్పుల నగేష్,,ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్ లు ,నాయకులు ఉన్నారు



# రోడ్డుపై మొక్కజొన్నలు, వడ్లు ఆరబెట్టడం ద్వారా ప్రమాదాలు

**-ప్రమాదానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొలిపాక మల్లయ్య**

**- ప్రమాదానికి కారకులైన ఇద్దరిపై కేసు నమోదు**

ఓదెల ఏప్రిల్ 23 (మనం న్యూస్) :పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని మడక రోడ్లపై మొక్కజొన్నల ను ఆరబెట్టడం ద్వారా కొలిపాక మల్లయ్య రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడక గ్రామానికి చెందిన గుంపుల సమ్మయ్య,దుర్గం బాలరాజు అనే ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై మొక్కజొన్నలను ఆరబెట్టడం వల్ల మొక్కజొన్నల పై నుండి వెళ్ళడం ద్వారా మడక గ్రామానికి చెందిన కొలిపాక మల్లయ్య అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో సహా రోడ్డుపై పడడం వలన తలకు తీవ్ర రక్త స్రావమై తీవ్రమైన గాయాల పాలై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతతున్నాడు. కొలిపాక మల్లయ్య ప్రమాదానికి కారకులైన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.ఓదెల మండల ప్రజలు,రైతులు రోడ్లపై వడ్లను,మొక్కజొన్నల ను ఆరబెట్టడం, నేర్పడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి తీవ్రమైన గాయాల పాలై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.గుండ్లపల్లి నుంచి గుంపుల గూడెం వరకు,ఓదెల నుండి కొలనూరు వరకు గల డబల్ రోడ్డు,ఇతర రహదారులపై రైతులు వడ్ల కుప్పలను ఓసి ప్రమాదం లకు కారకులు కావద్దన్నారు.ఓదెల మండలంలోని 22 గ్రామాల రైతులు రహదారులపై రైతులు వడ్లను,మొక్కజొన్నలను ఆరబెట్టి,సీడ్ మెల్ గడ్డిని రోడ్డుమీద వేసి,వడ్ల కుప్పల పై పర్దాలు పరిచి రాళ్లు పెట్టి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అంతేగాక ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. రైతులు వడ్లను, మొక్కజొన్నల ను ఆరబెట్టడానికి,నేర్పడానికి, సీడ్ మెయిల్ గడ్డిని పెట్టడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.రోడ్లపై వడ్లను,మొక్కజొన్నలను ఆరబెట్టడం,నేర్పడం, సీడ్ మెల్ గడ్డిని రోడ్డుమీద వేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగితే అ కుప్పల కు సంబంధించిన యజమానులపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎస్.ఎం.సి కమిటీ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

గొల్లపల్లి ఏప్రిల్ 23 (మనం న్యూస్) బీ మండలంలోని తిర్మలపూర్ (పి.డి) ప్రభుత్వ ఉర్దూ మద్యమా ప్రాథమిక పాఠశాలలో గురువారం రోజున విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంచేందు కు ఎస్.ఎం.సి కమిటీ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా చిన్నారి విద్యార్థిని, విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు (ప్రోగ్రెస్ కార్డులు) అందుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఎంతో ఆకట్టు కున్నాయి. పాఠశాల హెడ్ మాస్టర్ మహమ్మద్ ముఖిముద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల గ్రాడ్యుయేషన్ వేడుకలు ప్రాథమిక విద్య పూర్తి చేసుకుని, ప్రాథమికోన్నత (ప్రైమరీ) పాఠశాలలో అడుగుపెడుతున్న విద్యార్థులను అభినందించడం దీని ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ తరహా కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని పెంచడంతో పాటు, విద్యార్థులలో ఉన్నత చదువుల పట్ల ఆసక్తిని కలిగిస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి విక్రమ్,ఉప సర్పంచ్ మస్కం ఆంజనేయులు,అమ్మ ఆదర్శ పాఠశాల కమీటీ చైర్పర్సన్ రిహాన సభ్యులు నఫిస్, అప్సనా,గౌషియా, సైఫ సమ్రీన్,కుల్సుమ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ప్రభూత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి



రాయికల్, ఏప్రిల్ 23(మనం న్యూస్): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో నేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రాయికల్ ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులను తప్పనిసరిగా బాలికల ఉన్నత పాఠశాల రాయికల్ లో చేర్పించాలని ఉపాధ్యాయులను కోరడమైనది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇప్పుడు ప్రభూత్వ పాఠశాల విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుండి అల్పాహారం మరియు పాలను కూడా అందించనున్నట్లు తెలిపారు .ప్రభుత్వ పాఠశాలలు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్ గౌడ్ మండలోజు రవీందర్, అలిరాజా,నాగరాజు, పద్మజ వనిత తిరుమల ప్రాథమిక పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నర్సయ్య,ఉపాధ్యాయులు లక్కడి రాజారెడ్డి, వేల్పుల గంగరాజం,మండలోజు రవీందర్,పుర్రె శ్రీనివాస్, మచ్చ స్వరూప తదితరులు పాల్గొన్నారు

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఇల్లందకుంట, ఏప్రిల్ 23 (మనం న్యూస్): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తోడేటి శ్రీనివాస్ అన్నారు. ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నూరి ప్రవీణ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామ పాలన అధికారి రాజేష్, ఏపీఎం స్వామి, సెంటర్ ఇంచార్జ్ జనార్ధన్, సీసీ లు మొగిలి, సరిత, వివో అధ్యక్షురాలు మమత, సుజాత రైతులు మరియు హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయం పునర్నిర్మాణం కోసం రూ.5వేల విరాళం



ఇల్లందకుంట, ఏప్రిల్ 23 (మనం న్యూస్): ఇల్లందకుంట మండల కేంద్రంలోని శివాలయం పునర్నిర్మాణం కోసం భవంతుల భావన బాలకృష్ణ దంపతులు గురువారం నిర్వాహకులకు రూ. ఐదు వేల విరాళం అందజేశారు. మండల కేంద్రంలో పునర్నిర్మానం చేపడుతున్న శివాలయ నిర్మాణం కోసం భక్తులు విరి విరిగా విరాళాలు అందజేయాలని నిర్వాహకులు రాయమల్లు కోరారు. బాలకృష్ణ దంపతులు విరాళం అందజేయడం అభినందనీయమన్నారు.

# పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి సౌకర్యాలు పొందాలి



మెట్ పల్లి ఏప్రిల్ 23 ( మనం న్యూస్ ) పిల్లల్ని ప్రభుత్వ పాఠశా లల్లో చదివించి ప్రభుత్వం కల్పించే అన్ని సౌక ర్యాలు పొందాలని తహ సిల్దార్ నీత అన్నారు. గురువారం మండలం లోని వెల్లుల్ల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల లొ జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలల్లో చక్కటి సౌకర్యా లు, మంచి పరిజ్ఞానం, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారన్నా రు. మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశా లల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తు న్న అన్ని సౌకర్యాలు పొందాలని ఆమె తెలిపారు. 2025-2026 వి ద్యా సంవత్సరంలో 6 నుండి 9 వ తరగతి చదివిన విద్యార్థులకు. "ప్రగతి పత్రాలు" తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. సర్పంచ్ గూడూరు తిరుపతి, ప్రధానోపా ధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజారామ్, రజిత, చంద్రయ్య, స్కైలాబ్, సత్యనారాయణ, సురేఖ, రెవెన్యూ ఆర్ఐ ఉమేష్, గ్రామ పాలన అధికారి నాగరాణి తదితరులున్నా రు.

# పెద్దపల్లిలో రానున్నది బహుజన రాజ్యమే



పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) : పెద్దపల్లిలో రానున్నది బహుజన రాజ్యమేనని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ మెహరాజ్ కు పార్టీ కండువా కప్పి అలిండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో పెద్దపెల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఏకమై బహుజన రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బహుజనులందరిని ఏకం చేసి, వారి ఆశీర్వాదంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని తెలిపారు. బహుజన బిడ్డనైనా నన్ను దీవించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మహమ్మద్ మెహరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, అందుకే భోజనం రాజ్యం కోసం ఫార్వర్డ్ పార్టీలో చేరానన్నారు. కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుజనలంతా ఏకం చేసి ఒక బీసీ బిడ్డ ఎమ్మెల్యేగా చేసే వరకు తన పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, గులాం ఖాజా పాషా, కుక్క కనకరాజు బొంకూరి నరేందర్, కుక్క అశోక్, ఇరుగురాల రాజు, కుక్క శ్రీనాథ్, వడ్డేపల్లి తిరుమల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలపెల్లి అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్



జగిత్యాల, ఏప్రిల్ 23,(మనం న్యూస్ ) : జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ గురువారం బాలపెల్లి గ్రామం లో అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్‌లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు హాజరయ్యారు. సిడిపిఓ మమతా మేడం, సూపర్వైజర్ శ్రీలక్ష్మి పాల్గొని పిల్లల పోషణ, ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే అంగన్వాడి కేంద్రంలో ప్రీస్కూల్ డే గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్‌ను ఘనంగా నిర్వహించి, పిల్లలను అభినందించారు.

# ఎరువులు విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్ బృందం

భీమిని ఏప్రిల్ 23 మనం న్యూస్ భీమిని మండలం లోని ఎరువులు పురుగు మందుల దుకాణాలను గురువారం టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు తహసిల్దార్ బికర్నదాస్ ఎస్సై కోటేశ్వర్ వ్యవసాయ అధికారిని యమునాదురుగా తనిఖీ చేశారు. తనిఖీలు భాగంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్ లను మరియు రసీదు బుక్కులను పరిశీలించడం తో పాటు పి ఓ ఎస్ మిషిన్ ను పరిశీలించారు. గోదాములు సందర్శించి విత్తనాలు నిల్వలు,స్టాక్ రిజిస్టర్,బిల్లులు, ఇన్వాయిస్ ఇతర సంబంధిత రికార్డు అమ్మకాలు జరుగుతున్న తీరును పరిశీలించారు అనంతరం మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాలు లేదా నిషేధిత గ్లైపోసిట్ ద్రావణం నిషేధిత పత్తి విత్తనాలు విక్రాయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాము అని హెచ్చరించారు .ప్రతి విత్తన పురుగు మందుల దుకాణాల యజమానులు విత్తనాలను పురుగుమందులను ఎమ్మార్పి ధరకు మాత్రమే విక్రాయించాలని రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని అని డీలర్ లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి,తప్పని సరిగా రసీదు తీసుకోవాలి అని



సూచించడం జరిగింది. రసీదు లేకుండా విత్తనాలు పురుగు మందులు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతు పేరును రిజిస్టర్లు నమోదు చేయాలని సూచించినట్లు తెలిపారు నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు

బోయినపల్లి, ఏప్రిల్ 23 (మనం న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టుపై నియమించిన పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన స్టే, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ కుట్రలకు గట్టి చెంపపెట్టు అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య పేర్కొన్నారు. గురువారం బోయినపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని, ఇది పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ నివేదిక అని తమ పార్టీ మొదటి నుండి చెబుతున్న మాట నేడు అక్షరాలా నిజమైందని ఆయన అన్నారు. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును రెండేళ్లుగా పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి అన్నదాతలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తే న్యాయస్థానాలు ఊరుకోవని ఈ తీర్పు రుజువు చేసిందని స్పష్టం చేశారు. రాజకీయ క్రీడను పక్కన పెట్టి, వెంటనే మేడిగడ్డ బ్యారేజిలో దెబ్బతిన్న పిల్లర్లను రిపేర్ చేసి రైతులకు సాగునీరు అందించాలని హితవు పలికారు. గోదావరి జలాలను పక్క రాష్ట్రాలకు తరలిస్తూ, తెలంగాణ




వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టాలని చూస్తే రైతులే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, మాజీ సర్పంచ్ చిందం రమేష్, కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

# బుద్ధిపల్లి గ్రామ పంచాయతీని తనిఖీ చేసిన ఎంపీఓ సుమన్

హాజీపూర్, ఏప్రిల్ 23 మనం (న్యూస్): మండల పరిధిలోని బుద్ధిపల్లి గ్రామ పంచాయతీని గురువారం మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) సుమన్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, పారిశుధ్య కార్యక్రమాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి, అక్కడ శాస్త్రీయ పద్ధతిలో కంపోస్టు ఎరువును తయారు చేయాలని సూచించారు. అనంతరం నర్సరీని సందర్శించి నాటిన ప్రతి మొక్కా 100 శాతం బతికేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని,పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను నిరంతరం పర్యవేక్షించాలని, స్మశాన వాటిక ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వర్క్ సైట్ వద్ద కూలీలకునీడ కోసం టెంట్లు,త్రాగునీటి సౌకర్యం ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు,ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ని కలిసి అదనపు ఎస్పీ చేతన్ నితిన్

జగిత్యాల ఏప్రిల్ 23 ( మనం ప్రతినిధి ): జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా నియమించబడిన చేతన్ నితిన్ ఐపీఎస్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.




# కొత్త అడిషనల్ కలెక్టర్‌గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



కరీంనగర్ ఏప్రిల్ 23(మనం బ్యూరో) : కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా డి. శ్రీనివాస్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు రేరాలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇటీవల కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ గా నియమించింది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రెవెన్యూ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కె. మహేశ్వర్‌తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు శ్రీనివాస్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుధాకర్, కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ నరేందర్, రాజేష్, కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ ఇంజినీర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

కరీంనగర్, ఏప్రిల్ 23(మనం బ్యూరో)..నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో కరీంనగర్ కన్సల్టెంట్ సివిల్ ఇంజనీర్స్ కరీంనగర్ సెంటర్ 2025-2027 నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం అట్ట వాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెక్రటరీ జనరల్ ఆడెపు కాశీరాం హాజరై ఎన్నికైన కార్యవర్గం చే ప్రమాణ-స్వీకారం చె యించారు. చైర్మన్గా నల్ల లక్ష్మయ్య, సెక్రటరీగా సబ్బని శ్రీనివాస్, కొ శాధికారిగా కోమటి వేణు మాధవ్ సభ్యులుగా భీమనాథుని రంజిత్ కుమార్, ప్రశాంత్, శ్రవణ్, రాజగోపాల్, సహకార్యదర్శిగా అనిల్, సహ కొ శాధికారిగా ప్రమోద్, వైస్ చైర్మన్ గా అన్వర్, ఎల్ రాజు, జి. వి కిషన్, జగన్ప్రణయ్. స్మరణ్, ముఖ్యసలహాదారులుగా పాక పవనకృష్ణ, కోల అన్నారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, పెద్దపల్లి, నల్గొండ, జగిత్యాల, సిరిసిల్ల, మెట్పల్లి, కోరుట్ల ఇంజనీర్లు పాల్గొ న్నారు.



## మంత్రాల నెపంతో వ్యక్తి దారుణ హత్య



జైపూర్ , ఏప్రిల్ : 23 (మనం న్యూస్) : జైపూర్ మండల కేంద్రంలోని ఏసీపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో బెజ్జాల గ్రామ నివాసి గుమ్ముల రాజం హత్య కేసు వివరాలను ఏసీపి వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రాల నెపంతోనే ఈ దారుణ హత్య జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు.నిందితులు గుమ్ముల తిరుపతి, వెంకటి, నర్సమ్మ, రాజబాబులు తమ కుటుంబానికి జరుగుతున్న కీడుకు రాజం చేస్తున్న మంత్రాలే కారణమని నమ్మి, అతడిని అంతం చేసేందుకు పథకం పన్నారని వివరించారు. పథకం ప్రకారం మంగళవారం సాయంత్రం రాజం ఆలయం నుండి వస్తుండగా, గ్రామ శివారులో తిరుపతి అతడిపై కర్రతో, రాళ్లతో దాడి చేసి చంపి, మృతదేహాన్ని సుందిళ్ల ప్రాజెక్టు కాలువలో పడవేసినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో వేగంగా స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నామని, వారిని రిమాండ్‌కు తరలిస్తున్నామని ఏసీపి ప్రకటించారు. ఈ సమావేశంలో సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు రాజశేఖర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యాల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ



మల్యాల, ఏప్రిల్ 23,( మనం న్యూస్): మల్యాల మండలం లో ఆయా గ్రామంలో గురువారం రోజున మానాల,తక్కళ్ళపల్లి ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్నీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తో కలిసి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమం కోరే ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలు లో రైతుల కు లక్ష కోట్లు పై నిధులను రైతుల సంక్షేమంలో రైతులకు రుణమాఫీ, రైతు భరోసా,యంత్రాంగం పై సబ్సిడీ లకు కేటాయించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ గౌడ్,మల్యాలమార్కెట్ కమిటీ చైర్పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మిట్టే శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంగ ఆనందరెడ్డి,మ్యాక లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచులు, దారం ఆదిరెడ్డి రెడ్డి ,పాపారావు ఇట్టి రెడ్డి సీత అంజిరెడ్డి, హనుమంతు, తిరుపతి,మరాఠీ బుచ్చిరెడ్డి, మెట్పల్లి లత,ఉప సర్పంచులు,జిల్లా యూత్ అధ్యక్షుడు శంకర్, మ-ంత్తయ్య,గంగాధర్ శ్రావణ్ కుమార్, హరినాథ్, ప్యాక్స్ సీఈఓ మనోజ్ కుమార్,అగ్రికల్చరల్ ఏఈవో మంజుల తది తరులు ఉన్నారు.

## రైస్ మిల్లులు, సెన్సస్ శిక్షణ కార్యక్రమం పరిశీలించిన అదనపు కలెక్టర్ బీఎస్ లత



మేడిపల్లి ఏప్రిల్ 23 (మనం న్యూస్); జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలో గురువారం రోజు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్ లత పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని వాసుదేవ, సురభి, సూర్య రైస్ మిల్లులను ఆమె సందర్శించారు. రబీ 2024-25 మరియు ఖరీఫ్ 2025 సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీలు పెండింగ్‌లో లేకుండా, సమయానికి బియ్యం సరఫరా చేయాలని రైస్ మిల్లర్లకు ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం జనగణన--2027 (సెన్సెస్), నిర్వహణకు సంబంధించి మేడిపల్లి మండలంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. ఇన్వెస్టిగేటర్లు, సూపర్వైజర్లకు అందిస్తున్న శిక్షణను సమీక్షించి, జనగణన ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా క్రమపద్ధతిలో నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా డేటా నమోదు విధానం, గోప్యత పరిరక్షణ అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలకు తక్షణ పరిష్కారాలు అందించే విధంగా పనిచేయాలని అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎమ్మార్వో, ఎంపీడీవో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బ్రిక్ టు బుక్స్..విద్యతో జీవిత మార్పు



కరీంనగర్ ఏప్రిల్ 23(మనం బ్యూరో)..గంగాధర మండలంలోని గట్టుభూత్కూర్‌లో నిర్వహిస్తున్న "బ్రిక్ టు బుక్స్" వర్క్ సైట్ స్కూల్ ద్వారా వలస కార్మికుల పిల్లలకు విద్యా వెలుగు చేరుతోంది. విభిన్న రాష్ట్రాల నుంచి వచ్చిన ఇటుక బట్టీలలో పని చేసే కార్మికుల కుటుంబాలకు చెందిన 66 మంది విద్యార్థులకు, ఐదు నెలల విద్యాభ్యాసం అనంతరం ప్రగతి పత్రాలు అందజేయబడ్డాయి. ఈ పిల్లల్లో చాలా మందికి ఇది మొట్టమొదటి విద్యా గుర్తింపు కావడం విశేషం. తల్లిదండ్రుల ఉపాధి కోసం తరచూ ప్రాంతాలు మారాల్సి వచ్చే పరిస్థితుల్లో కూడా, విద్యార్థులకు గణితం, ఆంగ్లం, చిత్రలేఖనం వంటి ప్రాథమిక నైపుణ్యాలపై దృష్టి సారించి బలమైన పునాది వేయబడింది. ఈ ప్రగతి పత్రాలు కేవలం మార్కుల పత్రాలు కాదు---వీటివల్ల విద్యార్థులు ఎక్కడికెళ్లినా తమ విద్యను కొనసాగించేందుకు ఆత్మవిశ్వాసం, అవకాశాలు లభిస్తాయి. గంగాధర మండలం, కరీంనగర్ జిల్లాలో వర్క్ సైట్ స్కూల్ విద్యార్థులకు ఈ విధంగా ప్రగతి పత్రాలు ఇవ్వడం మొట్టమొదటి సారి జరగడం గర్వకారణం.ఈ కార్యక్రమంలో హెచ్ఎం చంద్రకళ, జ్యోతి (వీవీ), కావ్య (వీవీ), సిఆర్పీ మధుకర్, ఎంఈఓ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

## వడదెబ్బతో ఫోటోగ్రాఫర్ మృతి

మంథని,ఏప్రిల్ 23 (మనం న్యూస్) మంథని పట్టణానికి చెందిన శ్రీ రామ ఫోటో స్టూడియో యజమాని గంధం నగేష్ (55) వడదెబ్బతో ఆకస్మికంగా మృతి చెందాడు.గురువారం విధినిర్వహణలో ముత్తారం మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి ద్విచక్ర వాహనం పై వెళ్లి కర్ణ వేద కార్యక్రమానికి ఫోటోలు తీసి మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి వచ్చి అకస్మాత్తుగా పడిపోయాడు.వెంటనే కుటుంబ సభ్యులు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికప్పుడే మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు. ఫోటోగ్రాఫర్ మృతి పట్ల మంథని పట్టణంలోని ఫోటోగ్రాఫర్ల యూనియన్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## శ్రీ భగీరథ మహర్షికి జిల్లా కలెక్టర్ ఘన నివాళి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -23(మనం ప్రతినిధి ): శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.ముందుగా శ్రీ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, కుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి మాత జయంతి అధికారికంగా ప్రకటించడం పట్ల హర్షం



పెద్దపల్లి /ఎలిగాడు ఏప్రిల్ 23 (మనం ప్రతినిధి) : ఎలిగేడు ఆర్య వైశ్యుల కుల దైవం శ్రీ వాసవి మాత జయంతి ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషమని ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తాటి పెళ్లి సతీష్ బాబు అన్నారు.ఆనాడు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు తో పాటు ఈ నెల 26 న జరిగే వాసవి మాత జయంతోత్సవం ఇక పై ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ప్రతి ఒక్క ఆర్యవైశ్యులు గర్వించదగ్గ విషయం అని.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు గారికి ఆర్యవైశ్యుల అందరి తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.